తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం - 29- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 55 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి



పరీక్షల పారదర్శకతపై సీఎం దృష్టి
ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలకు పిలుపు
కోచింగ్ కేంద్రాల నియంత్రణకు జాతీయ విధానం అవసరం
ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం
హైడ్రా పనులు కొనసాగుతాయని స్పష్టీకరణ
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రశ్నపత్రాల లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు తలెత్తలేదని, ఆఫ్‌లైన్ పరీక్షల సమయంలోనే ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనుమతులు లేకుండానే కోచింగ్ కేంద్రాలు విస్తరిస్తున్నాయని,

మిగతా 2లో

# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల కు సీఎం విజ్ఞప్తి

- ప్రధానమంత్రి గ్రామీణ గృహ పథకం కింద కేటాయింపులు కోరిన సీఎం
- ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర సహకారం అందించాలని వినతి
- గ్రామీణ ఉపాధి పథకంలో అదనపు పనుల ప్రతిపాదన
- తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రికి ఆహ్వానం




**న్యూఢిల్లీ, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ పథకం కింద 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి,

మిగతా 2లో



# రెండేళ్ల హైడ్రా ప్రస్థానం నగర రక్షణకు కొత్త దిశ

- 3,325 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ
- గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణతో వరదల నియంత్రణ
- రూ.1.50 లక్షల కోట్ల ప్రజా ఆస్తుల పరిరక్షణ
- సుస్థిర హైదరాబాద్ నిర్మాణమే లక్ష్యం

**డెస్క్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

నగరాన్ని వరదలు, అక్రమ ఆక్రమణలు, జలవనరుల విధ్వంసం నుంచి రక్షించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా) రెండేళ్ల ప్రస్థానంలో గణనీయమైన ఫలితాలు సాధించింది. 2024 జూలై 19న ఏర్పాటైన హైడ్రా ఇప్పటివరకు 3,325 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

మిగతా 2లో

# ఢిల్లీ పోలీసులకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు



- జంతర్ మంతర్ లాఠీచార్జ్‌పై సీరియస్
- నీట్-యూజీ నిరసనల ఘటనను సుమోటోగా స్వీకరించిన కమిషన్
- సీసీటీవీ దృశ్యాలు సమర్పించాలని అధికారులకు ఆదేశం
- రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులకు సూచన
- విద్యార్థుల హక్కుల పరిరక్షణపై దృష్టి సారించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్

**న్యూఢిల్లీ, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పోలీసుల లాఠీచార్జ్ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ స్వయంగా జోక్యం చేసుకుంది. విద్యార్థులపై బలప్రయోగం జరిగిన తీరును అత్యంత తీవ్రంగా పరిగణించిన కమిషన్, దీనిపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. నీట్ యూజీ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని ఆరోపిస్తూ పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వివిధ వార్తా కథనాలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్సీ ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించాలని నిర్ణయించింది.

మిగతా 2లో

# రైతునే రాజుగా తీర్చిదిద్దే రైతునేస్తం : మంత్రి తుమ్మల

- సచివాలయంలో ఘనంగా రైతునేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమం
- 1,600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతుల భాగస్వామ్యం
- రైతు–శాస్త్రవేత్త–అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక
- ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలకమన్న మంత్రి

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**




రాష్ట్ర రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను చేరవేయడం, శాస్త్రవేత్తల సలహాలను నేరుగా అందుబాటులోకి తీసుకురావడమే రైతునేస్తం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించిన రైతునేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు,

మిగతా 2లో



# తెలంగాణ స్ఫూర్తితో టీవీ అవార్డులు: కోమటిరెడ్డి

- తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే లోగో, అవార్డుల రూపకల్పనకు ఆదేశం
- పి.వి. నరసింహారావు పేరు పరిశీలనలో ఉందన్న మంత్రి
- పారదర్శకంగా అవార్డు గ్రహీతల ఎంపికకు సూచనలు
- ప్రతిష్ఠాత్మకంగా తొలి టెలివిజన్ అవార్డుల నిర్వహణకు సన్నాహాలు

7లో

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: పొన్నం

- ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించిన మంత్రి
- వినతులపై అధికారులతో నేరుగా మాట్లాడి ఆదేశాలు
- భూ సమస్యలు, ఇళ్లు, సంక్షేమ ఫిర్యాదులపై సమీక్ష
- నిర్ణీత గడువులో సమస్యల పరిష్కారానికి సూచనలు

7లో



# శాసనసభ కమిటీల తొలి సమావేశం

- స్పీకర్ ఛాంబర్‌లో మూడు కమిటీల ప్రారంభ సమావేశాలు
- కమిటీల పనితీరుపై స్పీకర్ కీలక సూచనలు
- నూతన నియమావళి రూపకల్పనపై మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదన
- పారదర్శకంగా పనిచేయాలని కమిటీలకు పిలుపు

7లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని చోట్ల అవే ప్రశ్నపత్రాల లీకేజీలకు కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులను అరికట్టేందుకు దేశస్థాయిలో సమగ్ర విధానం రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

విశ్వవిద్యాలయాల వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం అధిక జోక్యం చేసుకోవద్దని, విద్యా వ్యవస్థ రాష్ట్రాల పరిధిలోనే ఉంటే పారదర్శకత మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరగాలని సూచించారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ విధానానికి అనుగుణంగా ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతో పరీక్షల నిర్వహణలో పారదర్శకత సాధించామని సీఎం తెలిపారు. విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడిన కొన్ని సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల అవి జాతీయ స్థాయి పరీక్షల వరకు ప్రభావం చూపాయని విమర్శిస్తూ, ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు అవసరమన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ కాలానికి చెందిన బకాయిలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించామని, అవసరమైన నిధులను ముందుగానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఈ పథకానికి అవసరమవుతాయని పేర్కొన్నారు.

హైడ్రా కార్యకలాపాలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. హైకోర్టు ఆదేశాలను ఇంకా పూర్తిగా పరిశీలించాల్సి ఉందని, ప్రభుత్వ స్థాయిలో సమీక్షించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూనే హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజాహితం దృష్ట్యా భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల కు సీఎం విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)



వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో పేదలకు సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పనిచేస్తోందని వివరించారు. గత ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో గృహాల అవసరం గణనీయంగా పెరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొంటూ, వీలైనంత త్వరగా ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధి, జీవనోపాధి కార్యక్రమంలో అదనపు పనులను చేర్చాలని ముఖ్యమంత్రి కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు పంటల వైవిధ్యీకరణకు తోడ్పడే పనులను చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక కేంద్రాలు, వెదురు వనాల అభివృద్ధి వంటి పనులను పథకంలో చేర్చాలని ప్రతిపాదించారు.

కొండ ప్రాంతాలు, కొండ వాలుల్లో నీటి నిల్వ కందకాల నిర్మాణం, పండ్ల తోటల్లో తేమ సంరక్షణ పనులు, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులను కూడా గ్రామీణ ఉపాధి కార్యక్రమంలో చేర్చాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో ఉపాధి హామీ పథకం తరహాలో 90 రోజుల పని అవకాశాన్ని కల్పించాలని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాష్ట్రానికి రావాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. సమావేశంలో పలువురు తెలంగాణ ఎంపీలు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# రైతునే రాజుగా తీర్చిదిద్దే రైతునేస్తం : మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రైతునేస్తం రైతులకు ఎంతో ఉపయోగకరమైన డిజిటల్ వేదికగా నిలిచిందన్నారు. రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడం దేశంలోనే వినూత్న ప్రయత్నమని ప్రశంసించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయశాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు, అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రతి రైతువేదికను విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో నిరుపయోగంగా మారిన రైతువేదికలను వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలతో ఆధునీకరించి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు ఒకే వేదికపై ప్రత్యక్షంగా చర్చించుకునే అవకాశాన్ని కల్పించడం ద్వారా శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం నేటితో 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకోవడం రైతుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇప్పటివరకు 24,85,581 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొనగా, వారిలో 5,26,107 మంది మహిళా రైతులు ఉన్నారని తెలిపారు. రెండేళ్లలో 27 లక్షలకుపైగా రైతులు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం ఉదయం నిర్వహించే రైతునేస్తం ద్వారా రైతులు అడిగే ప్రశ్నలకు అదే సమయంలో శాస్త్రవేత్తలు సమాధానాలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. దీనివల్ల పంటలకు సమస్యలు తలెత్తకముందే నివారణ చర్యలు తీసుకునే అవకాశం రైతులకు లభిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే వ్యవసాయం కోసం సాంకేతిక పరిజ్ఞానం అత్యవసరమని పేర్కొంటూ, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతునేస్తం ద్వారా వాతావరణ హెచ్చరికలు, జిల్లాల వారీగా అనువైన పంటలు, శాస్త్రీయ సాగు విధానాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

ఎల్‌నినో ప్రభావం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను ప్రభుత్వం, రైతులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నీటి కొరత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, చెరువులు, ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేదని, అందువల్ల రైతులు వరి సాగును విచక్షణా రహితంగా విస్తరించవద్దని హెచ్చరించారు. జూలైలో సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, సెప్టెంబరులో కూడా వర్షాలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆదర్శ రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు. తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు రైతునేస్తం ద్వారా నేర్చుకున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు, ప్రకృతి వ్యవసాయం, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధానాలపై తమ విజయగాథలను ఇతర రైతులతో పంచుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలు, యూరియా వినియోగ నియంత్రణ చర్యలు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష సలహాలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా సన్మానించగా, ప్రతి జిల్లాకు చెందిన ఐదుగురు ఆదర్శ రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు అందించారు.

# స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ

- అత్యాధునిక పరిశ్రమలకు తెలంగాణ ప్రోత్సాహం
- విక్రమ్-1 విజయంపై ముఖ్యమంత్రికి వివరాలు
- అంతరిక్ష రంగంలో సహకార అవకాశాలపై చర్చ
- స్టార్టప్‌లకు ప్రభుత్వం పూర్తి మద్దతు



**ఢిల్లీ, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి భరత్ డాకా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ కార్యకలాపాలు, అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగ అభివృద్ధిపై ఇరువర్గాలు విస్తృతంగా చర్చించాయి. సమావేశంలో స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతినిధులు భారతదేశంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్‌తరగతి ప్రయోగ వాహనం "విక్రమ్ 1"ను విజయవంతంగా ప్రయోగించిన విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. దేశ అంతరిక్ష రంగానికి ఇది చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు.

తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆధునిక తయారీ, పరిశోధనఅభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని స్కైరూట్ ప్రతినిధులు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య మరింత సమన్వయం పెంచితే ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో అంతరిక్ష, ఏరోస్పేస్ రంగాల్లో పెట్టుబడులు, పరిశోధన కేంద్రాల ఏర్పాటు, తయారీ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించేలా పారిశ్రామిక విధానాలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. యువతకు అధునాతన సాంకేతిక రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.

ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి అభినందించారు. వారు సాధించిన విజయం భారత అంతరిక్ష రంగ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచిందని కొనియాడారు. ఇలాంటి సంస్థలు దేశ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని, యువ పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్టార్టప్‌లు, అత్యాధునిక సాంకేతిక సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన మద్దతు, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ రాష్ట్రాన్ని అంతరిక్ష, ఏరోస్పేస్ రంగాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

# రెండేళ్ల హైడ్రా ప్రస్థానం నగర రక్షణకు కొత్త దిశ

(మొదటి పేజీ తరువాయి)




చెరువులు, వాగులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు నగరాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా తీసుకెళ్లే చర్యలను హైడ్రా చేపడుతోంది. వేగంగా విస్తరిస్తున్న నగరంలో చెరువుల ఆక్రమణలు, నాలాల కుదింపు, ప్రణాళిక లేని నిర్మాణాల కారణంగా వరదలు, నీటి ఎద్దడి వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ఒకప్పుడు సహజ వరద నియంత్రణ వ్యవస్థగా పనిచేసిన గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ దెబ్బతినడంతో వర్షాకాలంలో స్వల్ప వర్షానికే అనేక ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు హైడ్రా చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణ, వర్షపు నీటి సహజ ప్రవాహ మార్గాల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించింది.

మొదటి దశలో బతుకమ్మకుంట, నల్లచెరువు, బమృకున్-ఉద్-దౌలా చెరువు, తమ్మిడికుంట, సున్నం చెరువు, ఉప్పల్ నల్లచెరువు సహా ఆరు చెరువులను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం మరో 14 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. నగర నాలుగు దిక్కుల్లో అంబీర్ చెరువు, ఫాక్స్ సాగర్, అమీన్‌పూర్ పెద్ద చెరువు, సరూర్‌నగర్ పెద్ద చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దే పనులు కూడా చేపట్టింది. చెరువుల వద్ద పార్కులు, నడక మార్గాలు, బహిరంగ వ్యాయామ కేంద్రాలు, చిన్నారుల ఆట స్థలాలు ఏర్పాటు చేస్తూ వాటిని ప్రజలకు ఉపయోగపడే జీవన ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తోంది. హైడ్రా చేపట్టిన చర్యలతో నగరంలోని పలు ప్రాంతాల్లో వరద ముప్పు గణనీయంగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. అమీర్‌పేట, కృష్ణానగర్, ప్యాట్నీ, శ్రీరాం నగర్, తమ్మిడికుంట, గురునాథ్ చెరువు, ఖాజాగూడ చెరువు తదితర ప్రాంతాల్లో నాలాల పూడిక తొలగింపు, ఆక్రమణల నివారణ, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీరు సాఫీగా వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గతంలో వరదలతో ఇబ్బందులు ఎదుర్కొన్న వేలాది కుటుంబాలకు ఈ చర్యలతో ఉపశమనం లభించిందని వివరించారు.

అక్రమ ఆక్రమణల నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, నాలాలు, రహదారులు, ప్రజావసరాలకు కేటాయించిన భూములను హైడ్రా తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇందులో 2,665 ఎకరాల ప్రభుత్వ భూమి, 454.11 ఎకరాల చెరువు భూమి, 90.39 ఎకరాల పార్కుల భూమి, 25.37 ఎకరాల నాలాలు, 62.18 ఎకరాల రహదారులు, ఫుట్‌పాత్‌లు, 26.31 ఎకరాల ప్రజావసరాల భూములు ఉన్నాయి. ఐలాపూర్, గాజులరామారం, కొండాపూర్, పీర్జాదిగూడ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్‌గూడ, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో భారీ స్థాయిలో ప్రభుత్వ భూములను కాపాడినట్లు అధికారులు వెల్లడించారు. నగరాన్ని వరదల నుంచి రక్షించడం, జలవనరులను పరిరక్షించడం, ప్రజా ఆస్తులను కాపాడడం, పర్యావరణ సమతుల్యతను నెలకొల్పడం వంటి లక్ష్యాలతో హైడ్రా తన కార్యాచరణను కొనసాగిస్తోంది. గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పచ్చదనం పెంపు, ప్రజా అవసరాల కోసం భూముల వినియోగం వంటి కార్యక్రమాల ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితమైన, సుస్థిరమైన హైదరాబాద్‌ను అందించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఢిల్లీ పోలీసులకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)




ఘటన జరిగిన సమయంలో అక్కడి సీసీటీవీ దృశ్యాలను వెంటనే భద్రపరచి కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. నిరసన సమయంలో పోలీసుల చర్యలు చట్టబద్ధమైన విధానాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా, అనవసర బలప్రయోగం జరిగిందా అనే అంశాలను ఈ దృశ్యాల ఆధారంగా పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను సమగ్రంగా సేకరించాలని కూడా సూచించింది. ఈ వ్యవహారంపై రెండు వారాల్లో పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. లాఠీచార్జ్‌కు దారితీసిన పరిస్థితులు, పోలీసుల చర్యలు, విద్యార్థుల భద్రత కోసం తీసుకున్న చర్యలు, ఘటన అనంతరం చేపట్టిన చర్యలపై పూర్తి వివరాలు అందించాలని ఆదేశించింది. నివేదికను పరిశీలించిన అనంతరం అవసరమైతే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని కమిషన్ తెలిపింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని న్యాయ నిపుణులు గుర్తు చేస్తున్నారు. అలాంటి సందర్భాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉన్నప్పటికీ, బలప్రయోగం చివరి మార్గంగా మాత్రమే ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్సీ జోక్యం ప్రాధాన్యం సంతరించుకుంది. నీట్ యూజీ పేపర్ లీకేజీ వ్యవహారం ఇప్పటికే దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఈ పరిస్థితుల్లో జంతర్ మంతర్ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ చేపట్టిన విచారణతో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. కమిషన్ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి వస్తే సంబంధిత అధికారులు తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రవాణా సౌకర్యాల లేమితో శాంతినగర్ ప్రజల అవస్థలు





**ఎల్కతుర్తి, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం శాంతినగర్ గ్రామానికి జాతీయ రహదారి563 (ఎన్‌హెచ్563) నుంచి గ్రామంలోకి ప్రవేశించేందుకు సర్వీస్ రోడ్డు, హుజురాబాద్ వైపు వెళ్లేందుకు యూటర్న్ సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో మంగళవారం గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి జాతీయ రహదారి563 (ఎన్‌హెచ్563)పై ధర్నా నిర్వహించారు.

గ్రామంలో ప్రైవేట్ పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, రైస్‌మిల్‌తో పాటు విస్తారమైన వ్యవసాయ భూములు ఉండటంతో రోజువారీ రాకపోకలు మరింత కష్టతరంగా మారాయని గ్రామస్థులు తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు చిన్న పాపయ్యపల్లి అండర్‌బ్రిడ్జి వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందని, హుజురాబాద్‌కు వెళ్లాలంటే వల్బాపూర్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడంతో సమయం, ఇంధనం, ప్రయాణ వ్యయం అనవసరంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినప్పటికీ గ్రామ సూచిక బోర్డు, బస్‌స్టాప్ ఏర్పాటు చేయకపోవడం పట్ల కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామానికి సర్వీస్ రోడ్డు, సురక్షితమైన యూటర్న్‌తో పాటు అవసరమైన రవాణా సౌకర్యాలను తక్షణమే కల్పించాలని ప్రభుత్వాన్ని, జాతీయ రహదారుల అధికారులను డిమాండ్ చేశారు.

ఈ సమస్యపై ఇప్పటికే హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో గ్రామస్థులు ధర్నాకు దిగారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాసాని వేళంగిమేరి రాయపురెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, సందీప్ రెడ్డి, పెద్దారెడ్డి ప్రదీప్ రెడ్డి, ఇన్నారెడ్డి, పెంటారెడ్డి స్వప్న, సింగిరెడ్డి జ్యోతి, సెయింట్ అన్న్స్ స్కూల్ యాజమాన్యం, రైతులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటర్ పేరు నమోదయ్యేలా చూడాలి



- **బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్**

**పెద్దమందడి,జులై28(తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తప్పనిసరిగా నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ సూచించారు. మంగళవారం పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో చేపడుతున్న ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలు లక్ష్మి, పుష్పలత, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, మండల అధికారి కర్ణంతో మాట్లాడి గ్రామంలోని మొత్తం ఓటర్ల సంఖ్య, ఆన్‌లైన్‌లో పూర్తయిన దరఖాస్తుల శాతం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులెవరూ ఓటరు జాబితాకు దూరం కాకుండా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దమందడి మండల అధ్యక్షులు ముప్పూరి చెన్నయ్య, మాజీ మండల అధ్యక్షులు రమేష్ తిరుపతయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



- **మోజర్ల సర్పంచ్ చంద్రశేఖర్**

**పెద్దమందడి,జులై28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చెందిన కాటారం చెన్నమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, మోజర్ల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ ఆమె నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు అధైర్యానికి గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. చెన్నమ్మ మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాములు, సింగం కృష్ణ, సింగం నరసింహ, కావలి కురుమయ్య, భూపని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథ్‌పూర్‌లో వడ్డెర సంఘానికి కొత్త సారథులు



**ఎల్కతుర్తి, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో వడ్డెర సంఘం నూతన గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షులు వల్లేపు సుధాకర్, హుస్నాబాద్ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు బొంత రమేష్, ఎల్కతుర్తి మండల అధ్యక్షులు గొలేన ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎల్కతుర్తి పట్టణ అధ్యక్షులు ఓర్సు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి అల్లెపు ప్రశాంత్, కోశాధికారి అల్లెపు రాజు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు. అలాగే గోపాల్‌పూర్ గ్రామ అధ్యక్షులు సూర మొగిలి, ఉపాధ్యక్షులు గండికోట జంపయ్య, ప్రధాన కార్యదర్శి ఓర్సు కొమురయ్య, సహాయ కార్యదర్శి గండికోట రాము హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అనంతరం జగన్నాథ్‌పూర్ గ్రామ వడ్డెర సంఘం నూతన కమిటీని ప్రకటించారు. మహిళా అధ్యక్షురాలిగా శివరాత్రి ఈశ్వరమ్మ, అధ్యక్షులుగా శివరాత్రి మల్లయ్య, గౌరవాధ్యక్షులుగా బొంత అనిల్, ఉపాధ్యక్షులుగా బొంత సది, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి మొగిలి, కార్యదర్శిగా బొంత సాంబారాజు, కోశాధికారిగా శివరాత్రి చిరంజీవి, ప్రచార కార్యదర్శిగా కస్తూరి కుమార్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన కమిటీ నాయకత్వంలో జగన్నాథ్‌పూర్ గ్రామ వడ్డెర సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. వడ్డెర సమాజ హక్కుల పరిరక్షణ, సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం కమిటీ సభ్యులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పామిరెడ్డిపల్లిలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ 100 శాతం పూర్తి



- **సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం**

**పెద్దమందడి,జులై28(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో ఓటర్ల నమోదు ప్రక్రియను 100 శాతం పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బీఎల్‌ఏ2లు, సంబంధిత అధికారులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ పరిధిలోని 78, 79, 80, 82 బూత్‌లలో అర్హులైన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజలు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏ2లు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఓటరు జాబితాకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇందిరా లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు సిద్ధయ్య, తిక్కన్న, వార్డు సభ్యులు కృష్ణ, నరేష్, భాస్కర్, కొంకలి నరసింహ, మండల ఆర్ఐ శంకర్, జీపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, బీఎల్‌వోలు సునీత, లక్ష్మి, భాగ్యమ్మ, శారదతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులు అందజేసిన వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్




**భీమదేవరపల్లి, జూలై 28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. వాటిలో కళ్యాణ లక్ష్మి పథకం అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. ఆడబిడ్డ పెళ్లి సందర్భంగా తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవితాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉపసర్పంచ్ మారం సతీష్, గజ్జల రమేష్, జీపీఓ సంపత్, లబ్ధిదారులు మంచాల మంజుల, గుండాల రాజమణి, వేల్పుల సరిత తదితరులు పాల్గొన్నారు.

# జడ్ పి ఎచ్ ఎస్ కన్నారం పాఠశాలలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య అవగాహన సదస్సు



**వేలేరు, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరుమండలం జడ్ పి ఎచ్ ఎస్ కన్నారం పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధుల నివారణ, శారీరక, మానసిక, సాంఘిక ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా వేలేరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి సాయిని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు.

పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చెరుకు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సీహెచ్ అనిత కుమారి, ఎస్. ఎస్తేరా, ఆశా కార్యకర్తలు జమున, మణెమ్మ, ఉపాధ్యాయులు జి. రాజు, బి. కిషనన్, బి. హైమ, కే. రఘుపతి, కే. రాజుకుమార్, జి. సంజీవ్తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## కూలీల సేవాభావానికి సెల్యూట్..



- **మల్లారెడ్డిపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభించిన ఏసీపీ మాధవి**

**వీణవంక, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. గ్రామ భద్రతను బలోపేతం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాల ప్రారంభోత్సవం గ్రామస్థుల సమక్షంలో జరిగింది.

ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ, నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో ఇలాంటి నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం అవసరమని సూచించారు.

ఇసుక లారీల పట్టాలు కట్టే కూలీలు తమ మూడు రోజుల కూలీని గ్రామ భద్రత కోసం వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. వారి సామాజిక బాధ్యత ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

గ్రామ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని ఏసీపీ మాధవి అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టు వరద జలాలను సాగుకు విడుదల చేయాలి



**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,జూలై28(తెలంగాణ ముచ్చట్లు):** జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద జలాలను వృథాగా సముద్రంలోకి వదిలేయకుండా సాగునీటి అవసరాలకు వినియోగించి రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ అంశంపై ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ఆత్మకూర్ పట్టణంలో ఏర్పాటు చేయనున్న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా జూరాల ప్రాజెక్టు నుంచి సాగుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రాంమోహన్ రెడ్డి, అలా వెంకటేశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## ఉద్యాన డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం





**పెద్దమందడి,జూలై28(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ కొండా లక్ష్మణ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్కేఎల్‌టీజీహెచ్‌యూ), ములుగు ఆధ్వర్యంలోని వివిధ ఉద్యాన కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉద్యాన కళాశాల మోజర్ల అసోసియేట్ డీన్ డాక్టర్ వీణ జోషి తెలిపారు.బై.పీ.సీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు నాలుగేళ్ల వ్యవధి గల ఉద్యాన డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూన్ 30 ఉదయం 10 గంటలకు ప్రారంభమైందన్నారు.రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి ఆగస్టు 15 సాయంత్రం 5 గంటల వరకు, పూర్తి చేసిన ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి ఆగస్టు 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులోని వివరాలను సవరించుకునేందుకు విశ్వవిద్యాలయం నిర్ణయించిన తేదీల్లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 8977129027, 7683053157 నంబర్లను సంప్రదించాలని డాక్టర్ వీణ జోషి కోరారు.

# ప్రతిభతో ఆకట్టుకున్న పెద్దమందడి శిశు మందిర్ విద్యార్థులు



**పెద్దమందడి, జూలై28(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన శిశు మందిర్ విద్యార్థుల కోసం నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన మేళాలో పెద్దమందడి శిశు మందిర్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రెండు బహుమతులను కైవసం చేసుకున్నారు.వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో తమ ప్రతిభను చాటిన విద్యార్థులు పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఫస్ట్ ఎయిడ్ విభాగంలో గీతాశ్రీ ప్రథమ బహుమతి, డ్రై వాటర్ సిస్టమ్ విభాగంలో విద్య ప్రియ ద్వితీయ బహుమతిని సాధించినట్లు ప్రధానాచార్యులు శ్రీమతి అరుణ, మాతాజీలు శశికళ, అమీనా తెలిపారు.విజేతలకు జిల్లా అధ్యక్షులు శ్రీ సూర్యనారాయణ, జిల్లా కోశాధికారి గట్టుమీది భానుప్రసాద్, కేడీఆర్ స్కూల్ కార్యదర్శి అరవింద్ ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమోహన్, కిషోర్, శరత్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను నిర్వాహకులు అభినందించారు. విద్యార్థుల ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ.. కాంగ్రెస్ హామీల అమలుపై కౌశిక్ రెడ్డి ఫైర్

**వీణవంక, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన సహాయం అందిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాల అమలులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోందని విమర్శించిన ఆయన, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను సకాలంలో అందజేయడంతో పాటు తులం బంగారం కూడా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, వీణవంక-జమ్మికుంట ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం పెండింగ్‌లో ఉన్న కాల్వల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసి హుజూరాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఎమ్మెల్యే, రైతులు, మహిళలు, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# జమ్మికుంటలో రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీలకు రంగం సిద్ధం

- **పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కే. హుస్సేన్**

**జమ్మికుంట టౌన్ జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీల పోస్టర్‌ను తెలంగాణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కే. హుస్సేన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఘనంగా ఆవిష్కరించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జమ్మికుంట వేదికగా రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీల నిర్వహణ పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ పోటీలు ఫోటోగ్రాఫర్ల ప్రతిభను వెలికితీయడమే కాకుండా జమ్మికుంటకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగానికి మరింత ప్రోత్సాహం అందించేలా ఈ పోటీలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేద విద్యార్థులకు అండగా ఉపాధ్యాయుడు.. విద్యాదానానికి గ్రామం జేజేలు



**జమ్మికుంట టౌన్ జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామ ఎంపీపీఎస్‌లో మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుర్ర సమ్మయ్య తన సొంత ఖర్చుతో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ కందికట్ల మధుసూదన్ మాట్లాడుతూ, విద్య విలువ తెలిసిన వ్యక్తిగా కుర్ర సమ్మయ్య విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డబ్బేట రవీందర్ మాట్లాడుతూ, "విద్యాదానం అన్నిదానాలకన్నా గొప్పది" అనే భావనను ఆచరణలో చూపించిన కుర్ర సమ్మయ్య ఇతరులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్రవంతి రాజు, ఉపాధ్యాయులు గుడిమల్ల బలరాం, ఎస్. కుమారి, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు జి. శైలజ, వి.వి. రేఖ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# సత్యం గౌడ్ మృతి బాధాకరం.. కుటుంబానికి అండగా ఉంటాం

- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**పెద్దమందడి,జులై28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వీరయపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త సత్యం గౌడ్ మృతి పట్ల మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, సత్యం గౌడ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..సత్యం గౌడ్ మృతి ఎంతో బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యులు ఈ విషాద సమయంలో అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఎలాంటి అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని, కుటుంబానికి అన్ని విధాలుగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.సత్యం గౌడ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన నిరంజన్ రెడ్డి, భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

# ప్రజలు—బీఎల్వోల సహకారంతో అల్వాలలో ఎస్ఐఆర్ విజయవంతం



**పెద్దమందడి,జూలై28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఓటరు ఎన్యూమరేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తైంది. గ్రామ ప్రజలు, బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్వోలు) సమన్వయంతో అతి తక్కువ సమయంలో ప్రక్రియను పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ రాజామహేందర్ రెడ్డి తెలిపారు.గ్రామంలో గతంలో 1,046 మంది ఓటర్లు ఉండగా, తాజా ఆన్లైన్ నమోదులో 1,001 మంది ఓటర్లు నమోదు అయ్యారని ఆయన పేర్కొన్నారు. వివిధ కారణాలతో 45 ఓట్లు జాబితా నుంచి తొలగించబడినట్లు వివరించారు. అలాగే ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో గ్రామ ప్రజలు, బీఎల్వోలు అందించిన సహకారం అభినందనీయమని సర్పంచ్ రాజామహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉద్యమ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను సహించం




- **ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ**

**ఎల్కతుర్తి, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఉద్యమ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు అంశాలను వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ అనేది వ్యక్తిగత ప్రయోజనాలు లేదా పదవుల కోసం పనిచేసే సంస్థ కాదని, మాదిగల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా ఉద్యమ సంస్థ అని తెలిపారు. కేవలం నల్ల కండువా ధరించడం లేదా తమను తాము ఎమ్మార్పీఎస్ నాయకులుగా ప్రకటించుకోవడం ద్వారా ఎవరూ సంస్థ ప్రతినిధులు కాలేరని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ పేరును అనధికారికంగా ఉపయోగించడం, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యమాన్ని వాడుకోవడం ఉద్యమ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలేనని అన్నారు. అలాంటి వారిని ఉద్యమ కార్యకర్తలు, మాదిగ సమాజ సభ్యులు గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకే ఎమ్మార్పీఎస్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, అధికారికంగా నియమితులైన నాయకుల ద్వారానే సంస్థ నిర్ణయాలు అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్యకర్తలు అధికారిక నాయకత్వం ఇచ్చే పిలుపు మేరకే కార్యక్రమాల్లో పాల్గొనాలని, సంస్థ విడుదల చేసే అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేశారు. చివరగా, ఉద్యమ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలని, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక న్యాయం సాధనే ఎమ్మార్పీఎస్ ప్రధాన లక్ష్యమని అడ్డూరి అనిల్ మాదిగ పేర్కొన్నారు.





# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

- **ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**ఖమ్మం బ్యూరో,జూలై 28(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్కలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు పలువురు కేంద్ర మంత్రులను, పార్లమెంటు సభ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం జంతర్ మంతర్ లో ధర్నా నిర్వహించిన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ తదితరులు మంగళవారం కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులుj మల్లు రవి, టీఆర్ఎస్ పార్టీకి చెందిన వద్దిరాజు రవిచంద్ర తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు ఉన్న రైల్వే రాయితీ పాస్ లను గత కోవిడ్ సందర్భంగా రద్దు చేశారని, ఈ సదుపాయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పిస్తూ జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలని వారు కోరారు. జర్నలిస్టులకు, సొసైటీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించే విషయం పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన ఆయా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, పర్కాల సమ్మయ్య గౌడ్, కె.రమాదేవి, పద్మనాభరావు,నాయకులు గోపాల్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.






# పట్టణాభివృద్ధే లక్ష్యం.. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన జమ్మికుంట కౌన్సిలర్లు

**జమ్మికుంట టౌన్ జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మున్సిపల్ కౌన్సిలర్ల శిక్షణ కార్యక్రమానికి జమ్మికుంట మున్సిపాలిటీకి చెందిన పలువురు వార్డు కౌన్సిలర్లు హాజరయ్యారు. ప్రజాప్రతినిధుల సామర్థ్యాన్ని పెంపొందించి, పట్టణాభివృద్ధి పనులను మరింత వేగవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిక్షణలో వారు చురుకుగా పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ పాలనలో కౌన్సిలర్ల బాధ్యతలు, పట్టణాభివృద్ధి ప్రణాళికలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, పారదర్శక పాలన, ఆర్థిక నిర్వహణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక అంశాలపై నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు.

ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడంలో ఇటువంటి శిక్షణలు కీలక పాత్ర పోషిస్తాయని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ ద్వారా పొందిన అనుభవాన్ని జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి, వార్డుల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి వినియోగిస్తామని వారు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీల నుంచి హాజరైన ప్రజాప్రతినిధులతో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అనుభవాలను పంచుకోవడం ఈ శిక్షణలో మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని పాల్గొన్న కౌన్సిలర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.






# నేరాల ఛేదనలో మరింత కీలకమైన భాద్యతలు నిర్వర్తించాలి

**–పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, జులై 28(తెలంగాణ ముచ్చట్లు ):** నేరాల గుర్తింపు విషయంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ మరింత సమర్థవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్..నేరాలు, దొంగతనాలు, దోపిడీలు తదితరాలను గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని, పాత నేరస్థుల కదలికలకు సంబంధించి ముందస్తు సమాచార సేకరణలో సీసీఎస్ పోలీసుల పనితీరును స్వయంగా పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... నేరాల ఛేదనలో కీలకంగా వ్యవహరించే సీసీఎస్‌ను పటిష్ఠ పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అంతేకాక ప్రాపర్టీ రికవరీపై సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ రకాలైన నేరాల అదుపునకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు వేగవంతం చేయడానికి క్రైమ్ బృందాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలాని ఆదేశించారు.

# నేడు ఖమ్మం లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పర్యటన

**ఖమ్మం బ్యూరో, జులై 28(తెలంగాణ ముచ్చట్లు ):** జమ్మూ & కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నేడు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. అందులో భాగంగా ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో వచ్చి ఖమ్మం కార్పొరేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ దగ్గర లో న్ ఎస్ పి కాలనీలోని నూతన శివాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు వెలుగుమట్లలోని కానరోయ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. తర్వాత మధ్యాహ్నం 3.20 గంటలకు ఖమ్మం రూరల్ మండలం, గొల్లగూడెం గ్రామం లోని నామ ముత్తయ్య వరమ్మల స్మృతి వనాన్ని సందర్శించి నివాళులర్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మాంట్ ఫోర్ట్ హైస్కూల్‌లో డ్రగ్స్ & నార్కోటిక్స్‌పై అవగాహన సదస్సు

- **మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు**
- **సీ.ఐ. వి. విజయ రామ్ కుమార్.**

**ఖమ్మం బ్యూరో,జూలై 28(తెలంగాణ ముచ్చట్లు ):** స్థానిక గుట్టల బజార్ ప్రాంతంలో గల మాంట్ ఫోర్ట్ హైస్కూల్, ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్ గారి మార్గదర్శకత్వంలో విద్యార్థులకు డ్రగ్స్ మరియు నార్కోటిక్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీ.ఐ. వి. విజయ రామ్ కుమార్, (సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఈగల్ ఫోర్స్ డిపార్ట్మెంట్ తెలంగాణ) విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నేటి సమాజంలో యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ విలువైన జీవితాన్ని, ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని మరియు భవిష్యత్తును కోల్పోతున్నారని , డ్రగ్స్, నార్కోటిక్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలను విద్యార్థులకు ఉదాహరణలతో వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు అందించినా లేదా వాటి వినియోగానికి ప్రోత్సహించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడలు మరియు విద్యపై దృష్టి సారించి, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తైన యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు "డ్రగ్స్‌కు నో... ఆరోగ్యకరమైన జీవితానికి యెస్" అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్, స్కూల్ స్టాఫ్ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





# వీణవంకలో ఏసీపీ వార్షిక తనిఖీ.. గ్రామ భద్రతపై ప్రత్యేక దృష్టి

**వీణవంక, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):-** వీణవంక పోలీస్ స్టేషన్‌లో సహాయ పోలీస్ కమిషనర్ (ఏసీపీ) వి. మాధవి మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేరాల రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ, మాల్ఖానా, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఏసీపీ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు.
తర్వాత వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ భద్రతను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.
ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు జరగాలని పిలుపునిచ్చిన ఆమె, పోలీసులకు ప్రజలు సహకరిస్తే శాంతి భద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమాల్లో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకటి, వీణవంక ఎస్‌హెచ్ఓ ఆవుల తిరుపతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# పీఆర్సీ, డీఏల విడుదలలో జాప్యం.. ప్రభుత్వంపై డీటీఎఫ్ ఆగ్రహం

**ఇల్లందకుంట, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా పీఆర్సీ అమలు కాకపోవడం, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోతున్నారని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి ఆందోళన వ్యక్తం చేశారు. ఇల్లందకుంట మండలంలో నిర్వహించిన డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.
ఈ సందర్భంగా డీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, ఆరోగ్య బీమా పథకం కోసం మే నెల నుంచి ఉద్యోగుల వేతనాల నుంచి ప్రీమియం మినహాయింపులు చేస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. ఉద్యోగులకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందేలా స్పష్టమైన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.
ప్రాథమిక పాఠశాలలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న జీవో-25ను సవరించి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి మాట్లాడుతూ, టెట్ కేవలం ఉపాధ్యాయ అర్హత పరీక్ష మాత్రమేనని, అందువల్ల అర్హత మార్కులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అభ్యర్థులందరికీ ఒకే విధంగా నిర్ణయించాలని కోరారు. అలాగే అభ్యర్థులకు వారు అభ్యసించిన సంబంధిత సబ్జెక్టులోనే పరీక్ష నిర్వహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు సార్ల సంపత్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణు, ఎం. సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# స్మార్ట్ కిడ్జ్ జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **పర్యావరణ పరిరక్షణలో మన వంతు బాధ్యతను నెరవేర్చుదాం..**
- **అంటున్న స్మార్ట్ కిడ్జ్ పాఠశాల**

**ఖమ్మం బ్యూరో, జూలై 28(తెలంగాణ ముచ్చట్లు ):** స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ సహిత జ్యూట్ బ్యాగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య తో కలిసి జ్యూట్ బ్యాగుల ఆవిష్కరణను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచాలని , పర్యావరణ సహిత జూట్ బ్యాగులను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేయడం అభినందనీయం అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల జ్యూట్ బ్యాగులను తయారు చేయించి అందరికీ పంపిణీ చేస్తున్నాము అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను విద్యార్థులు తెలుసుకుని ఆచరించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరంతో పాటు ఈసారి కూడా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టళ్లలో సీట్లు పెంచాలి.. సొంత భవనాలు నిర్మించాలి

- **వసతుల లేమితో విద్యార్థుల ఇబ్బందులు.. ప్రభుత్వానికి బీసీ సంఘం విజ్ఞప్తి**

**హనుమకొండ, జులై 28 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో సీట్ల సంఖ్యను పెంచడంతో పాటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు శాశ్వత సొంత భవనాలు నిర్మించాలని బీసీ ఆజాదీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా బీసీ ఆజాదీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల బాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్ గౌడ్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో సీట్ల కొరత కారణంగా ప్రతి ఏడాది వందలాది మంది అర్హులైన బీసీ విద్యార్థులు హాస్టల్ ప్రవేశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, దీంతో విద్యార్థులకు సరైన వసతి, పరిశుభ్రత, భద్రత, తాగునీరు, నాణ్యమైన భోజనం, చదువుకు అనుకూలమైన వాతావరణం వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు.
బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో వెంటనే సీట్ల సంఖ్య పెంచాలని, అద్దె భవనాల్లో ఉన్న హాస్టళ్లకు సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.
అలాగే హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వసతులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, భద్రతా చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో బీసీ ఆజాదీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జినుకల లక్ష్మణ్‌రావు, శివకుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన కౌశిక్ రెడ్డి

- **దళిత బంధు, సాగునీరు, రహదారుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి**

**హుజూరాబాద్,28(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దళిత బంధు రెండో విడత నిధుల విడుదల, సాగునీటి సరఫరా, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులతో పాటు ఇతర అభివృద్ధి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ద్వారా వేలాది దళిత కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధించాయని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత బంధు రెండో విడతను నిలిపివేయడంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారని విమర్శించారు. ఎన్నికల హామీలకు అనుగుణంగా వెంటనే రెండో విడత నిధులను విడుదల చేసి ప్రతి అర్హ కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కన్నెపల్లి పంపుల ద్వారా అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, నందిమేడారం, మిడ్ మానేరు వరకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కాల్వల మరమ్మతులు చేపట్టి పంటలకు నీటి కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.
ఇసుక క్వారీల రాకపోకల కారణంగా హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలాల్లో ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే రహదారులను మరమ్మతు చేసి సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.
నియోజకవర్గంలోని ఇతర అభివృద్ధి, ప్రజా సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, హుజూరాబాద్ ప్రజల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తూ పోరాటం కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# భారీగా తగ్గిన బంగారం ధరలు..

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మార్కెట్లు, భౌగోళికరాజకీయ పరిణామాల ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు మంగళవారం భారీగా తగ్గాయి. పసిడి ధరలతో పాటు వెండి ధరలు కూడా క్షీణించాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం, మంగళవారం ఉదయం 10 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,170గా నమోదైంది. సోమవారంతో పోలిస్తే 10 గ్రాములకు రూ.1,690 తగ్గింది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,32,150గా ఉండగా, రూ.1,550 మేర తగ్గుదల నమోదైంది.
వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.5,000 తగ్గి రూ.2,35,000కు చేరుకుంది.
తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,170, 22 క్యారెట్ల ధర రూ.1,32,150, 18 క్యారెట్ల ధర రూ.1,08,130గా నమోదైంది.
ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,44,170, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,150, 18 క్యారెట్ల బంగారం రూ.1,08,130గా ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,160, ఢిల్లీలో రూ.1,44,320, ముంబై, కోల్‌కతా, కేరళలో రూ.1,44,170గా నమోదైంది. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,220గా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర ఢిల్లీలో రూ.1,32,300, చెన్నైలో రూ.1,32,150, అహ్మదాబాద్‌లో రూ.1,32,200గా నమోదైంది.



## ఓటరు జాబితాలో ఒక్క అర్హుడూ మిస్ కాకూడదు: దేశిని కోటి

**జమ్మికుంట టౌన్ జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితా నమోదు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశిని కోటి అధికారులకు, పార్టీ శ్రేణులకు సూచించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19వ, 4వ వార్డులకు చెందిన పోలింగ్ బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు)తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా దేశిని కోటి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ బూత్ పరిధిలో ఒక్క అర్హుడి పేరు కూడా మిస్ కాకుండా ఇంటింటి సర్వే నిర్వహించి, ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల పేర్లను తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, ఓటరు జాబితాలోని తప్పులు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బీఎల్ఓలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వార్డు బూత్ అధ్యక్షులు మడిపోజు రాజేష్, ఆడెపు దేవరాజ్, శివతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## వనమహోత్సవంలో మొక్కల పంపిణీ

- **పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం...సుహాసిని**

**హుజురాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వనమహోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు గారు వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు మొక్కలను అందజేశారు.

ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్ల పెంపకం వల్ల వాతావరణ సమతుల్యతతో పాటు ప్రజల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు.

హుజురాబాద్ పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 500 స్పెషలిస్ట్ డాక్టర్ల ఫలితాలు విడుదల

- **మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాలకు చెందిన మొత్తం 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల తుది ఫలితాలను విడుదల చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యుల కొరతను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఇప్పటికే అనస్థీషియా, ప్రసూతిస్త్రీరోగాలు, శిశువైద్యం, ఆర్థోపెడిక్స్ తదితర విభాగాలకు చెందిన 692 పోస్టుల భర్తీ పూర్తయ్యింది. ఎంపికైన వైద్యులకు నియామక పత్రాలు అందజేసి పోస్టింగులు కూడా ఇచ్చారు.

తాజాగా విడుదలైన ఫలితాల్లో జనరల్ సర్జరీలో 174, జనరల్ మెడిసిన్‌లో 166, ఆర్థోపెడిక్స్‌లో 89, రేడియాలజీలో 71 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రకటించారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి తుది ఎంపిక జాబితాను ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఎంపికైన వైద్యులు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి త్వరలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధుల్లో చేరనున్నట్లు అధికారులు తెలిపారు.

స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు ఎంపికైన వైద్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 విభాగాల్లో భర్తీ చేస్తున్న 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల్లో ఇప్పటివరకు 1,192 పోస్టుల భర్తీ పూర్తయిందని, మిగిలిన పోస్టుల నియామక ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను ఆదేశించారు.

# శాసనసభ కమిటీల తొలి సమావేశం

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ, నియమాల కమిటీ, నైతిక విలువల కమిటీల తొలి సమావేశాలు మంగళవారం నిర్వహించారు. సమావేశాలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాశ్ రెడ్డి, నియమాల కమిటీ సభ్యులు, ఇతర కమిటీ సభ్యులు సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును పర్యవేక్షించే బాధ్యత ప్రభుత్వ హామీల అమలు కమిటీపై ఉంటుందని,



ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. శాసనసభ నిర్వహణను మరింత సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తీర్చిదిద్దడంలో నియమాల కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

శాసనసభ గౌరవం కేవలం చట్టాల రూపకల్పనతోనే కాకుండా సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహార శైలితో కూడా ముడిపడి ఉంటుందని స్పీకర్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలోపేతం చేయడం కోసం నైతిక విలువల కమిటీ నిష్పక్షపాతంగా, రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. కమిటీ చైర్మన్లకు అభినందనలు తెలియజేశారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శాసనసభ సభ్యులకు మార్గదర్శకంగా ఉండేది నియమావళి పుస్తకమని, దానికి అనుగుణంగానే సభ నిర్వహణ జరుగుతుందని చెప్పారు. శాసనసభను మరింత సమర్థవంతంగా నడిపేందుకు కమిటీ చైర్మన్లు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో నియమావళిని రూపొందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల శాసనసభలను అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిశీలించాలని కూడా సూచించారు.

సభలో క్రమశిక్షణ, హుందాతనాన్ని కాపాడడంలో నైతిక విలువల కమిటీ కీలక బాధ్యత వహించాలని మంత్రి అన్నారు. కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉండి తెలంగాణ శాసనసభ దేశానికి ఆదర్శంగా నిలిచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ, శాసనసభ తమపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో శాసనమండలి కార్యదర్శి వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: పొన్నం

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి వారికి సమర్థవంతమైన పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి వినతిపై వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.



ఈ సందర్భంగా భూ వివాదాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రెండు పడకగదుల గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రవాసుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ప్రజావాణిలో ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతిని నిర్ణీత గడువులో పరిష్కరించాలని, పెండింగ్ ఫిర్యాదులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి సమావేశమై ప్రజావాణి నిర్వహణ విధానం, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ స్ఫూర్తితో టీవీ అవార్డులు: కోమటిరెడ్డి

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో తొలిసారిగా ప్రవేశపెట్టనున్న టెలివిజన్ అవార్డులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఉండాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. టెలివిజన్ అవార్డుల రూపకల్పన, మార్గదర్శకాలు, ప్రత్యేక లోగో, అవార్డుల పేర్లు, ఎంపిక విధానం తదితర అంశాలపై టెలివిజన్ అవార్డుల కమిటీతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి, కమిటీ చైర్మన్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో టెలివిజన్ అవార్డులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంపై విస్తృతంగా చర్చించారు. అవార్డులకు ప్రత్యేక లోగో రూపకల్పన, వివిధ విభాగాల్లో అవార్డుల ప్రదానం, అవార్డు గ్రహీతల ఎంపిక విధానం, ప్రదానోత్సవ వేదికల ఎంపిక వంటి అంశాలపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న ఈ అవార్డులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెలివిజన్ రంగం ప్రజలకు అత్యధిక వినోదాన్ని అందించే శక్తివంతమైన మాధ్యమమని అన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు టెలివిజన్ కార్యక్రమాలను ఎక్కువగా వీక్షిస్తున్న నేపథ్యంలో ఈ రంగంలో ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు, సామాజిక సందేశాలతో కూడిన సీరియళ్లు, కార్యక్రమాలు, బాలల కార్యక్రమాలను రూపొందించే వారిని ప్రోత్సహించే విధంగా అవార్డులను రూపొందిస్తామని స్పష్టం చేశారు. టెలివిజన్ అవార్డులకు మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు పేరు పెట్టాలన్న కమిటీ సభ్యుల ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని మంత్రి వెల్లడించారు. బహుభాషా కోవిదుడిగా, దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహనీయుడిగా పి.వి. నరసింహారావు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అలాంటి మహనీయుల పేర్లను అవార్డులకు పరిశీలించడంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.

టెలివిజన్ అవార్డులకు సంబంధించిన మార్గదర్శకాలు, లోగో, పేర్లు తదితర అంశాలను వీలైనంత త్వరగా సిద్ధం చేసి సమర్పించాలని కమిటీకి మంత్రి ఆదేశించారు. అవార్డుల పేరు, లోగో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ప్రత్యేకతను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. అవార్డు గ్రహీతల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిటీ చైర్మన్, సభ్యులకు సూచించారు. అవార్డుల నిర్వహణలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి రెండు లేదా మూడు వేదికలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎఫ్‌డీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వచ్చిన అన్ని ప్రతిపాదనలను ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం టెలివిజన్ అవార్డులపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా విశిష్ట సేవలకు ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఖమ్మం బ్యూరో, జులై 28(తెలంగాణ ముచ్చట్లు ):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులను స్మరించుకుంటూ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయురాలు గౌరికి ఘన సన్మానం అందుకున్నారు.

ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ అధికారి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని, నిస్వార్థ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం శాలువా కప్పి, జ్ఞాపిక అందించి వారిని సత్కరించారు.

ఉపాధ్యాయురాలు సూర్య కుమారి పాఠశాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయడం, విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలు చూపడం, ప్రధానోపాధ్యాయురాలు గౌరికి అన్ని విధాలా సహకారం అందించడం వంటి సేవలను గుర్తించి ఈ గౌరవం అందించడం విశేషం. అలాగే సమర్థవంతమైన నాయకత్వంతో పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించిన ప్రధానోపాధ్యాయురాలు గౌరికి కూడా ఈ సందర్భంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సన్మానం వ్యక్తిగత గౌరవమే కాకుండా విద్యా సేవలకు, జట్టు భావనకు, సమాజం అందించిన కృతజ్ఞతకు ప్రతీకగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానితులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ముడుమాల్ నిలువురాళ్లకు మరింత గుర్తింపు

- నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం
- యునెస్కో శాశ్వత గుర్తింపు కోసం కృషి
- పర్యాటకాభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు
- మంత్రి వాకిటి శ్రీహరి



**నారాయణపేట, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముడుమాల్ నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పార్కులో రహదారులు, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు, సమాచార కేంద్రాలు, సందర్శకుల సౌలభ్యానికి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకుల రాక పెరగడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని తెలిపారు. పర్యాటక రంగాన్ని గ్రామీణాభివృద్ధికి అనుసంధానం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో స్థానం లభించడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. యునెస్కో శాశ్వత గుర్తింపు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. యునెస్కో సూచించిన ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసి శాశ్వత గుర్తింపు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని పరిరక్షించేందుకు గతంలో జిల్లా అధికారులు తీసుకున్న చర్యలను కూడా ఆయన గుర్తు చేశారు.
ముడుమాల్ చారిత్రక విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని వేద కుమార్ తెలిపారు. జిల్లాలోని 400 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి సుమారు 60 వేల మంది విద్యార్థులు నిలువురాళ్లను సందర్శించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. అలాగే 20 మంది పర్యాటక మార్గదర్శకులను నియమించి సందర్శకులకు ఈ ప్రాంత చరిత్ర, ప్రాముఖ్యతను వివరించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక పర్యాటక మ్యాప్‌ను కూడా రూపొందించనున్నట్లు వెల్లడించారు. మూడువేల సంవత్సరాల క్రితమే ఖగోళ పరిజ్ఞానాన్ని ప్రతిబింబించేలా నిలువురాళ్ల నిర్మాణం జరిగినట్లు శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయని వేద కుమార్ పేర్కొన్నారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానం అందుబాటులోకి రాకముందే నక్షత్ర మండలాల ఆధారంగా ఈ నిర్మాణాలు చేపట్టడం మన పూర్వీకుల మేధస్సుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ శాఖలు, స్థానిక ప్రజలు, నిపుణులు కలిసి ఈ వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యునెస్కో శాశ్వత గుర్తింపు సాధిస్తే తెలంగాణ పర్యాటక రంగానికి ఇది మరింత ప్రతిష్ఠను తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: ప్రధాన కార్యదర్శి

- జిల్లా కలెక్టర్లతో అత్యవసర దూరవాణి సమావేశం
- రెండు రోజులపాటు భారీ వర్షా ల హెచ్చరికపై సమీక్ష
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం
- రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు పూర్తి సహకారం



**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో రానున్న రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా పోలీసు అధికారి లతో దూరవాణి ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వనమహోత్సవ కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు ఐదు నుంచి ఆరు మాత్రమే ఉండగా, మిగిలిన 26 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అన్ని జిల్లాల్లో విత్తనాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలనుకునే రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. భారత వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన యంత్రాలు, సహాయక బృందాలు సిద్ధంగా ఉంచి ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.
విపత్తు నిర్వహణ దృష్ట్యా జాతీయ విపత్తు స్పందన దళం బృందాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో ముందుగానే మోహరించినట్లు ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న అదనపు బృందాలను అవసరాన్ని బట్టి ప్రభావిత ప్రాంతాలకు వెంటనే తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ దూరవాణి సమావేశంలో ప్రధాన కార్యదర్శితో పాటు అహ్మద్ నదీమ్, దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి మరోసారి స్పష్టం చేశారు.

# నెరేళ్ల బాధితులకు న్యాయం చేయాలి

- గంధం గోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత
- బాధ్యులపై చర్యలు, బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ఎస్సీ కమిషన్ నివేదిక విడుదల చేయాలని కోరిన తెలంగాణ రక్షణ సేన చీఫ్



**రాజన్న సిరిసిల్ల, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** నెరేళ్ల ఘటనలో మృతిచెందిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ నెరేళ్ల ఘటన తెలంగాణ సమాజం తలదించుకునే సంఘటన అని పేర్కొన్నారు. ఆ ఘటన జరిగిన సమయంలో అధికారంలో ఉన్న కుటుంబంలో తాను కూడా సభ్యురాలినేనని, అందుకు బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. నెరేళ్ల ఘటనలో పోలీసుల దాష్టీకానికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు. అలాగే ఇసుక వ్యాపారంలో ధనదాహంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. బాధ్యులైన పోలీసు అధికారులు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
ఈ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ జరిగినప్పటికీ ఇప్పటి వరకు నివేదిక వెలువడలేదని కవిత పేర్కొన్నారు. ఆ నివేదికను వెంటనే విడుదల చేయాలని కోరారు. అవసరమైతే బాధిత కుటుంబాలతో కలిసి ఢిల్లీకి వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. నెరేళ్ల బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని ఆమె ఆరోపించారు. మృతుడు గంధం గోపాల్ కుటుంబం తొమ్మిదేళ్ల పాటు ఆసుపత్రుల చుట్టూ తిరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలందరికీ కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.
ఈ ఘటనపై రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కవిత పిలుపునిచ్చారు. నెరేళ్ల ఘటనలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రక్షణ సేన ప్రజల హక్కుల పరిరక్షణ కోసమే ఏర్పాటైన సంస్థ అని కవిత తెలిపారు. నెరేళ్ల బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తూ, బాధితుల తరపున పోరాడుతూ, పరిష్కారం సాధించే వరకు తమ మద్దతు కొనసాగుతుందని వెల్లడించారు.






# తబ్లీఘీ జమాత్ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు



- చాంద్రాయణగుట్టలో జరిగిన సమావేశానికి హాజరు
- మత పెద్దలు, నిర్వాహకులతో మర్యాదపూర్వక భేటీ
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రులు
- శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్ష

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో నిర్వహించిన తబ్లీఘీ జమాత్ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సి. లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు సమావేశానికి హాజరైన మత పెద్దలు, నిర్వాహకులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ వారి సేవలను అభినందించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు దేశంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. మత, సామాజిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నేతలు అభిప్రాయపడ్డారు. భిన్న మతాలు, సంస్కృతుల మధ్య పరస్పర అవగాహన, సహకారం మరింత బలపడాలని కోరారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో మత పెద్దలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. దేశంలో శాంతి, ప్రజల సంక్షేమం, సామాజిక సామరస్యం నెలకొనాలని ప్రార్థనలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్యానికి బలోపేతం

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రితో భాగస్వామ్యంపై సమీక్ష
- జిల్లా ఆసుపత్రుల్లో ఆధునిక నేత్ర చికిత్సల విస్తరణకు చర్యలు
- నవజాత శిశువుల కంటి పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే యోచన
- ఆగస్టులో కార్యాచరణ ప్రణాళిక కోసం ప్రత్యేక సదస్సు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన, సమాన వైద్య సేవలు అందించేందుకు పరస్పర సహకార అవకాశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో 35 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా, వాటిలోని నేత్ర వైద్య విభాగాలు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, దృష్టి కొలత సేవలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిరంతరం నిర్వహిస్తూ ప్రతి ఏడాది వేలాది మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర అత్యుత్తమ నేత్ర వైద్య కేంద్రంగా ఉన్న సరోజిని కంటి ఆసుపత్రిలో రెటీనా శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, మెల్లకంటి శస్త్రచికిత్సలు, కార్నియా మార్పిడి, కంటి కణితుల చికిత్స, కనురెప్పల శస్త్రచికిత్సలు, గ్లాకోమా చికిత్సలు వంటి అత్యాధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా నేత్ర వైద్య సేవలను మరింత విస్తరించేందుకు జిల్లా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ప్రత్యేక నేత్ర శస్త్రచికిత్స గదులు, అవసరమైన పరికరాల ఏర్పాటుకు లోటుపాట్ల అంచనా ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సౌకర్యాల అభివృద్ధిని దశలవారీగా, నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో అమలు చేస్తున్న నవజాత శిశువుల కంటి పరీక్షల పైలట్ కార్యక్రమం విజయవంతమైందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా ఇతర జిల్లాలకు కూడా విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ కార్నియా సేకరణ కేంద్రాలు (ఐ బ్యాంకులు) ఏర్పాటు చేయడంలో భాగస్వామ్యంపై కూడా చర్చించినట్లు వెల్లడించారు.
రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నేత్ర పరీక్షలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నేత్ర వైద్య సేవల బలోపేతానికి మరిన్ని సహకార రంగాలను గుర్తించేందుకు ఆగస్టు నెలలో ప్రభుత్వ బోధనాసుపత్రులు, నిపుణులు, సంబంధిత వర్గాలతో ప్రత్యేక సదస్సు నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, శాఖ ఉన్నతాధికారులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in